క్లుప్తంగా

బాధ్యతగా మెలగండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ సమాచారాన్ని తమకు ఇవ్వాల్సిందిగా కొందరు వ్యక్తులు కంపెనీ ఉద్యోగులను, అధికారులను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సింగరేణి డైరెక్టర్ (పీపీ అండ్ పా) కే.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి వారు ఏ స్థాయివారైనా లెక్క చేయాల్సిన అవసరం లేదని, కంపెనీ సమచారాన్ని కానీ, డాక్యుమెంట్లను బయటి వారికి ఇస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అటువంటిది ఏదైనా జరిగితే యాజమాన్యానికి సమాచారం తెలపాలని, కీలకమైన శాఖల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా ఉండాలని కోరారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

పాల్వంచ: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షణకుడు జవ్వాది వెంకటేశ్వర బాబు అన్నారు. స్థానిక బొల్లేరుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్త స్కూల్ అసిస్టెంట్(సోషల్)లకు తరగతులకు గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థుల నడవడిక, ప్రవర్తన, ఆచార వ్యవహారాలు, విద్యాబుద్ధులు నేర్పించాలని, సమాజంలో వారు బాధ్యతాయుతమైన వ్యక్తులుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రీనివాసబాబు, నాగరాజు, ప్రతిభ, కోర్సు కోఆర్డినేటర్ మంగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీకి రూట్ మ్యాప్

కొత్తగూడెంఅర్బన్: 2025 – 26 విద్యా సంవత్సరానికి కొత్తగూడెం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జూన్ మొదటి వారంలోనే ప్రభుత్వ పుస్తకాలు అందేలా చర్యలు చేపట్టినట్లు కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ తెలిపారు. గురువారం ఎంఆర్‌సీ కార్యాలయంలో కాంప్లెక్స్ హెచ్ఎం, రిసోర్స్‌పర్సన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. అనంతరం జూన్ 3న నిర్వహించనున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షకు సింగరేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రసాద్ సేవలు మరువలేనివి..

సుజాతనగర్: పేదల సమస్యలు, సీపీఐ అభివృద్ధికి కొలగాని ప్రసాద్ సేవలు మరువలేమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్‌లో కొలగాని ప్రసాద్ స్థూపావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్ల కమ్యూనిస్టు పార్టీలో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాబీర్‌పాషా, భూక్యా దస్రు, కొమారి హనుమంతరావు, తాళ్లూరి పాపారావు, లావుడ్యా గోపి, మూడు గణేష్, తాళ్లూరి ధర్మారావు, కామినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీ

టేకులపల్లి: మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను గురువారం డీఎస్పీ చంద్రభాను, ఎస్సై రాజేందర్, ఏఓ అన్నపూర్ణ తనిఖీ చేశారు. దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లు, నిల్వ ఉన్న స్టాక్‌ను సరిచూశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు ఎటువంటి సమాచారం ఉన్నా తమకు తెలియచేయాలని సూచించారు.

హక్కుల కోసం నినదిద్దాం..

ఇల్లెందు: ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతున్న టీపీటీఎఫ్‌ను బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు జి.హరిలాల్ కోరారు. గురువారం ఇల్లెందులో టీపీటీఎఫ్ 12వ వార్షికోత్సవం సందర్భంగా జోనల్ కార్యాలయంలో సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోవు కాలంలో టీపీటీఎఫ్ కార్యకర్తలు ఉద్యమ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.పూర్ణ చందర్‌రావు, సీహెచ్ రమేష్, సర్వేశ్వరరావు, గొగ్గెల సమ్మయ్య, ఇమ్మానియేల్, సీహెచ్ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పూర్ణిమా, కవిత, కిషన్, సమ్మయ్య, మోహన్‌బాబు పాల్గొన్నారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు..

ఇల్లెందురూరల్: సమస్యలు ఎదురైనప్పుడు బతికి సాధించుకోవాలే తప్ప ఆత్మహత్య పరిష్కారం కాదని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. ఏడుప్పలగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఏఎన్ఎం చింత సావిత్రి సంతాప సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీఒక్కరు సమస్యలకు భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగి ఇతరులకు స్ఫూర్తివంతంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, పాడుగు నర్సింహారావు, కొక్కు సారంగపాణి, సూర్నపాక నాగేశ్వరరావు, చింత నరసింహారావు, రజిత, పూనెం కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

‘సాగు’దామా.. ఆగుదామా!

- ముందే పలకరించిన రుతుపవనాలు
- భిన్న వాతావరణంతో రైతుల్లో ఆయోమయం
- అదునులోనే విత్తుకోవాలంటున్న అధికారులు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

ఇల్లెందురూరల్: ఏటా జూన్‌లో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొంటూ వానాకాలం సీజన్‌ను ప్రారంభించే రైతులకు ఈసారి అనుకోని పరిస్థితులు ఎదరవుతున్నాయి. ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఇంకా దుక్కులు సిద్ధం చేసుకోకముందే వర్షాలు సమృద్ధిగా కురవడం రైతులను ఆయోమయంలో పడేశాయి. ఈ పరిస్థితిలో సాగు చేద్దామా.. ఆగుదామా అన్న మీమాంసలో ఉన్న అన్నదాతలకు నేల పూర్తిగా తడిసిన తరువాతే సాగు ప్రారంభించాలన్న వ్యవసాయ శాఖ అధికారుల సూచిస్తున్నారు.

ఇంతకు ముందు చూడని భిన్న వాతావరణం...

యాసంగి సాగు ద్వారా వచ్చిన దిగుబడులను విక్రయించుకునే సమయం నుంచే వరణుడు తన ప్రతాపం చూపిస్తూ వచ్చాడు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ రైతులు ఎలాగోలా విక్రయించుకున్నారు.

రోహిణి కార్తె దాటే వరకు విశ్రాంతి తీసుకోవచ్చని భావించిన అన్నదాతలను ముందస్తుగా తరముకొస్తున్న వరణుడు పరుగులు పెట్టిస్తున్నాడు. ఇంతకుముందెన్నడూ చూడని భిన్నమైన వాతావరణం ఈసారి ఎదురవడంతో భవిష్యత్ ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురిసినా తీరా పంట చేతికందే సమయంలో వరణుడు ముఖం చాటేస్తే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆకాశపాయ ఆధారంగా పంటలు సాగు చేసే రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. రుతుపవనాల ప్రభావంతో నేలలో తేమ ఆవహించడంతో భారం దేవుడిపై వేసి రైతులు దుక్కులు సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. మరికొందరు రైతులు చేలల్లో గత పంటల వ్యర్థాలను తొలగించే పనిలో బిజీగా ఉన్నారు.

అనుకూలమా.. ప్రతికూలమా..

సాధారణంగా రోహిణి కార్తెలో ఎండవేడిమి అధికంగా ఉంటుంది. ఈ సమయంలో ప్రజలంతా విపరీతమైన ఉక్కపోతకు గురవడం మనం ఏటా చూస్తుంటాం. కానీ ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు రోహిణి కార్తె ప్రారంభంలోనే ప్రవేశించడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఈ ప్రభావంతో సహజంగానే నేల చల్లబడింది. కానీ రోహిణి కార్తెలో ఎండ వేడిమి అధికంగా ఉన్న సమయంలో దుక్కులు దున్నడం వల్ల రైతులకు మేలు చేకూరుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎండ వేడిమి అధికంగా ఉన్న సమయంలో దున్నడం వల్ల దుక్కుల నుంచి పంటలకు నష్టం కలిగించే క్రిమికీటకాలు బయటకు వచ్చి వేడిమి ప్రభావంతో నశించిపోతాయి. అంతేకాకుండా నేల పొరల్లో గాలి మార్పు జరుగుతుంది. ఈ క్రమంలో రోహిణి కార్తె తరువాత వచ్చే మృగశిర కార్తెలో కురిసిన వర్షాలకు నేల పూర్తిగా చల్లబడి విత్తనాలు విత్తుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. విత్తనాలలో మొలకశాతం కూడా అధికంగా ఉండి మంచి దిగుబడులకు అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ముందే వచ్చిన రుతుపవనాలకు స్పందించి విత్తనాలు విత్తుకుంటే సాగు ప్రయాణంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

అదునులోనే విత్తనాలు విత్తాలి...



గతంలో ఎన్నడూ లేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందే వచ్చాయి. వర్షాలు కూడా ఆశించిన మేర సమృద్ధిగా కురుస్తున్నాయి. ఈ సమయంలో రైతులు దుక్కులు సిద్ధం చేసుకోవాలి. విత్తనాలు విత్తుకునేందుకు మరికొంత సమయం వేచి చూడాలి. మృగశిరకార్తె దాటిన తరువాతే విత్తుకుంటే మంచి దిగుబడులకు అవకాశం ఉంటుంది.

– సతీష్, వ్యవసాయశాఖ అధికారి, ఇల్లెందు

చట్టాలపై అవగాహన అవసరం



మంత్రిని కలిసిన కిన్నెరసాని గ్రామస్తులు

పాల్వంచరూరల్: గిరిజన హక్కులు, చట్టాల గురించి గిరిజనులందరూ తెలుసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని కిన్నెరసాని గ్రామంలో గురువారం ఆగిన మంత్రి కుమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంత్రి సీతక్కను కలిసి స్థానిక ఆదివాసీ గిరిజనులకు టూరిజం శాఖ, జెన్కో అధికారులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చూడాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి ప్రభుత్వ ఉద్యోగాలు అర్హులకు వస్తాయని, వాటికోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి కోసం ప్రయత్నాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, స్థానికులు పెసా చట్టం కమిటీ అధ్యక్షుడు వాసం రామకృష్ణ, తాటి సురేష్, వజ్జ విజయ్, సోమయ్య, దొడ్డ విజయలక్ష్మి, బొర్రా సరోజిని, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రికి కార్యదర్శుల వినతి..

మండలంలోని కిన్నెరసానికి గురువారం వచ్చిన మంత్రి సీతక్కను గ్రామపంచాయతీల కార్యదర్శులు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పంచాయతీ కార్యదర్శులు బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, రవికుమార్, హన్నా, బాబూరావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం..

ఇల్లెందు: రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు వయోవృద్ధులు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూర్య (సీతక్క)కు ఇల్లెందు కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు.

గురువారం పాల్వంచలో అధికారిక కార్యక్రమాలు ముగించుకుని ఇల్లెందు మీదుగా వరంగల్ వెళ్తున్న సీతక్కను ఇల్లెందులోని కూరగాయల మార్కెట్ వద్ద కాంగ్రెస్ నాయకుడు ఎస్‌కే జానీ ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా స్వాగతం పలికి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కూరగాయల వ్యాపారులు, నాయకులు గౌస్, శ్రీనివాసగౌడ్, ధన్‌రాజ్, లింగంపల్లి శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, ఇబ్రహీం, సిరాజ్, మోకాళ్ల వెంకటమ్మ, తాజ్, మసూద్ ఉన్నారు.

గనిలో సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 ఇంక్‌లైన్ గనిలోని మ్యాన్‌రైడింగ్, కార్మికులకు తాగునీరు, గాలి, వెంటిలేషన్ తదితర సమస్యలను పరిష్కరించాలని కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ గని మేనేజర్ శ్యాంప్రసాద్‌ను కోరారు. గురువారం గనిలో వెంటిలేషన్ లేకుండా కార్మికులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు ఆయన గనిలోకి దిగి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ... గనిలో వెంటిలేషన్ సరిగా లేకపోవడంతో ఈనెల 23న ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారని, గని వెంటిలేషన్, ఆఫీసర్ గనిలోని సమస్యలపై ఫిజికల్‌గా మానిటరింగ్ చేయాలని, ఫోన్‌లో మానిటరింగ్ చేయటం సరికాదన్నారు. అంతేకంటే మూడు రోజుల క్రితం గనిలో గ్యాస్ పడి కార్మికులు ఆందోళన పడ్డారని, ఈ పరిస్థితులు మారోమారు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తం కాకుండా చూడాలని, ఏరియాలో 12 భూగర్భగనులకు ఒక్క గని మాత్రమే ప్రస్తుతం నడుస్తోందని, ఈ గనిలో ఏమైనా సమస్యలు ఎదురైతే ఏరియాలో కార్మికుల పరిస్థితి చెప్పతరం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సకినాల సమ్మయ్య, చిలక రాజయ్య, వల్లాల సాంబమూర్తి, జి.నవీన్, సాంబయ్య, గన్‌శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కార్మికులకు హక్కులు కల్పించండి..



మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సులభ్ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించటంలో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఇఫ్టూ ఆరోపించింది. గురువారం ఇల్లెందులో ఇఫ్టూ ప్రతినిధి బృందం సింగరేణి డీజీఎం మోహన్‌రావును కలిసి వినతిపత్రం అందజేసింది. 200 మంది సులభ్ కార్మికులు ఇంటర్నేషనల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఒక్కో సులభ్ కాంప్లెక్స్‌కు సింగరేణి యాజమాన్యం నెలకు రూ.25 వేలు సులభ్ ఏజెన్సీకి చెల్లిస్తుందన్నారు. కానీ కార్మికులకు ఎలాంటి చట్టబద్ధ హక్కులు, బోనస్, లీవులు, పండుగ సెలవులు, బ్యాంకు ద్వారా జీతాలు చెల్లించడం లేదన్నారు. సింగరేణి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేసి డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎండీ రాసుద్దీన్, కె.సారంగపాణి, కొండపల్లి శ్రీనివాసరావు, మహేందర్ ఉన్నారు.

పచ్చిరొట్టతో భూసారం పెంచుకోవాలి



పంటల సాగు విధానంపై వివరిస్తున్న శాస్త్రవేత్త నవీన్‌కుమార్

సుజాతనగర్: రైతులు పచ్చిరొట్ట సాగుతో భూసారాన్ని పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నవీన్‌కుమార్ సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యాక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గరీబ్‌పేట రైతు వేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పచ్చిరొట్టె పంటలను సాగు చేసుకుంటూ భూమిని సారవంతం చేసుకోవాలని యూరియా, నత్రజని సంబంధిత ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు నూతనంగా రూపొందించిన నూతన వంగడాల గురించి ఆయన రైతులకు వివరిస్తూ యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. మరో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ... రైతులు పంట మార్పిడి విధానాన్ని తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యాక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి నర్మద, అభ్యుదయ, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

అహల్యాబాయి గొప్ప పరిపాలనా మూర్తి



అర్చకులను సత్కరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతిని గురువారం స్థానిక గట్టాయిగూడెం శ్రీ అంజనేయస్వామి ఆలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అహల్యాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అర్చకులు, పూజార్లను సత్కరించారు. మాట్లాడుతూ.. అలహ్యాబాయి ఇండోర్ కేంద్రంగా పరిపాలన సాగించారని దేశంలో అనేక ప్రాంతాల్లో దేవాలయాలను పునరుద్ధరించారన్నారు. మహేశ్వరం పేరు మీద చేనేత చీరలను తయారు చేయించి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ కలిగేలా చేసి చేనేత మహిళలకు, కార్మికులకు ఉపాధి కల్పించారన్నారు. ఆ రోజుల్లోనే గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. రాపాక రమేష్, చింతల చెరువు శ్రీనివాసరావు, రంజిత్, జల్లారపు శ్రీనివాసరావు, నాగరాజు, సుభాష్ పాల్గొన్నారు.

హజ్ కమిటీ ఆధ్వర్యంలో సివిల్స్‌కు ఉచిత శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: 2026లో జరగనున్న యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థులకు ముంబైలోని హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ హౌస్ రెసిడెన్షియల్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ వారు అందిస్తున్న ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ పొందేందుకు జూలై 13న హైదరాబాద్‌లో అర్హత పరీక్ష ఉంటుందని, అర్హత సాధించిన వారికి ఒక సంవత్సరం ఉచిత శిక్షణతో భోజన, వసతి సౌకర్యం కల్పించటం జరుగుతుందని పేర్కొన్నారు. జూన్ 21 లోపు వెబ్‌సైట్‌లో రూ.100 పరీక్ష రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

జూన్ 9న సెక్యూరిటీ గార్డుల నియామకం

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ ఏరియాలో ఖాళీగా ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకం కోసం జూన్ 9న ప్రకాశం స్టేడియంలో ఉదయం 6 గంటలకు పరుగుపందెం నిర్వహించనున్నట్లు ఏ-1 రాయల్ సర్వీస్ నిర్వాహకులు ఎండీ.మహరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని, అభ్యర్థులు కార్పొరేట్ ఏరియా పరిధిలోని వారై ఉండాలని, బరువు 51 కేజీలు, చెస్ట్ 85 సెంటీమీటర్ల నుంచి 92, వయస్సు 21 - 45 సంవత్సరాలు అని తెలిపారు. దరఖాస్తుతోపాటు 10వ తరగతి మెమో, ఆధార్ కార్డ్ ఒరిజినల్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



డంప్‌షెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ ప్రభాకర్‌రావు

ఇల్లెందురూరల్: వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున పల్లెల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీఓ కె.ప్రభాకర్‌రావు ఆదేశించారు. బొజ్జాయిగూడెం, సుదిమళ్ల, రాఘబోయినగూడెం గ్రామపంచాయతీలలో గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో అంశాలవారీగా రికార్డులను పరిశీలించారు. చెత్తసేకరణ పనులను, డంప్‌షెడ్ నిర్వహణ, ఎరువుల తయారీ, పొడిచెత్త నిల్వలు, నర్సరీ, రహదారులను తనిఖీ చేశారు. తడి చెత్త నుంచి ఎరువు తయారీ పనులు సరిగా లేవని, ఎరువు తయారీపై దృష్టి సారించి మొక్కలకు వినియోగించాలని సూచించారు. పల్లెల్లో రహదారులపై చాలాచోట్ల గుంతలు ఉన్నాయని, గ్రావెల్ తోలించి గుంతలు పూడ్చాలని చెప్పారు. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు అజహర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఉన్న మైన్స్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్లు (ఎంవీటీసీలు) టెక్నికల్ ట్రెనింగ్ సెంటర్లు (టీటీసీల్లో) స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇవ్వాలని సింగరేణి డైరెక్టర్(పా) కే.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్ఆర్‌డీ భవన్‌లో ఎంవీటీసీ, టీటీసీ, నిమ్, యూఎంఐటీ) ట్రెనింగ్ సెంటర్ల నిర్వాహకులకు రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డైరెక్టర్ పాల్గొని మాట్లాడారు. అండర్ గ్రౌండ్, ఓపెన్‌కాస్ట్ గనుల్లో నూతన టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉద్యోగులందరికీ శిక్షణ ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా టీటీసీలో సిమ్యులేటర్‌పై ఈపీ ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని, దీంతోపాటు చేంజ్ ఆఫ్ జాబ్, చేంజ్ ఆఫ్ ఎక్విప్‌మెంట్, స్పెషల్ ట్రెనింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు షెడ్యూల్ ప్రకారం ట్రెనింగ్ నిర్వహించాలని సూచించారు. అనంతరం వివిధ ఏరియాల ఎంవీటీసీ, టీటీసీ ఉద్యోగులు ఈనెల 31న ఉద్యోగ విరమణ చేసే జీఎం హెచ్‌ఆర్‌డీ జి.రఘుపతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్, ఏజీఎం ఈఅండ్ఎం రామ్మోహన్, డీజీఎం నారాయణరావు, డీజీఎం ఎండీ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కాచనపల్లి అమరవీరులకు నివాళి



నివాళి అర్పిస్తున్న గుమ్మడి నర్సయ్య, నాయకులు

ఇల్లెందు: 34 ఏళ్ల క్రితం గుండాల మండలం కాచనపల్లి వద్ద ఐదుగురు విప్లవ కార్యకర్తలు కోటన్న, నంబూరి సీతారామారావు, సుసేనా, పరుశురాములు, చింతా లక్ష్మి రక్తతర్పణం చేశారని, వారి త్యాగం విప్లవకారులు, పీడిత ప్రజలు ఎల్లప్పుడూ స్మరించుకుంటారని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ప్రజాపంథా రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, నాయిని రాజు అన్నారు. గురువారం ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాచనపల్లి అమరుల సంస్మరణ దినం సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాచనపల్లి అమరవీరుల త్యాగంను పోరాట స్ఫూర్తిని వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు ఎడ్లపల్లి సావిత్రి, యాకుబ్‌షావలీ, మల్లెల వెంకటేశ్వర్లు, రంజాన్, రవి, సంపత్, పాండు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతో జ్ఞాపకశక్తి మెరుగు

పాల్వంచ: మానసిక ప్రశాంతతతోనే జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ఒత్తిడి లేని చదువును పిల్లలకు అందించాలని జిల్లా నోడల్ కోఆర్డినేటర్ ఎ.సీతామహాలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక కేటీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ... మానవుని శరీరంలో హృదయం ఎంతో ప్రధానమైందని, హృదయ స్పందన కేంద్రంగా ధ్యానం నిర్వహిస్తే ప్రతీ ఒక్కరు శారీరక జ్ఞానవంతులుగా ఎదుగుతారన్నారు. అనంతరం సీఐ కె.సతీష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న సైబర్ నేరాల నుంచి ఎలా బయటపడాలో వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు హరిప్రసాద్, బి.లాలు, బి.శంకర్, పద్మజ, ట్రైనర్లు వై.నిర్మల, మల్లారెడ్డి, పద్మ, పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఎదురుచూపులు

- బ్యాంకులకు చేరిన .. 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తులు
- రుణ జాబితా ఖరారు బ్యాంకు అధికారులదే
- ఇల్లెందు మున్సిపాలిటీలో 549 మందికి రుణాలు




ఇల్లెందు మున్సిపాలిటీలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు అందజేస్తున్న నిరుద్యోగులు (ఫైల్)

ఇల్లెందు: ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో శ్రీకారం చుట్టిన 'రాజీవ్ యువ వికాసం'పథకం దరఖాస్తులు బ్యాంకర్లకు చేరాయి. ఇల్లెందు మున్సిపాలిటీలో గత నెలంతా దరఖాస్తులు స్వీకరించి, ఈ నెలంతా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఒక్కో సామాజిక వర్గం వారీగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హత పత్రాలు పరిశీంచి జాబితాను తుది జాబితాను ఖరాలు చేసింది. అర్హత పత్రాల పరిశీలన పూర్తయిన జాబితా నుంచి రుణాలు అందించే వారిని ఖరారు చేయాల్సి ఉంది. ఈ జాబితా ఆయా బ్యాంకర్ల వద్ద పరిశీలనలో ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలనుగుణంగా రుణాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు ఎంపికైన లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేయనున్నారు. ఈ మధ్య కాలంలో ఒక్కో కేటగిరి నుంచి టార్గెట్ ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత బ్యాంకర్ల మీద పడింది. రుణాల ఎంపిక రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.4 లక్షలుగా నిర్ణయించారు. రూ.లక్ష లోపు వారికి బ్యాంక్‌తో సంబంధం లేకుండా రుణం అందే అవకాశం ఉండగా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు బ్యాంకు రుణం అందించనుంది. అయితే బ్యాంకర్లు కూడా రుణం నేరుగా లబ్ధిదారుల చేతికి అందించే అవకాశం లేదు. రూ.లక్ష లోపు ఉన్నవారు యూనిట్ నెలకొల్పేవారు ఆయా సామాజిక వర్గం కేటగిరీలో ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో పరిశీలించి ఆ యూనిట్ వల్ల ప్రయోజనాలు అంచనా వేసి బ్యాంకర్ రుణం ఇచ్చే అవకాశం ఉంటుందంటున్నారు. ఒకే రకమైన యూనిట్‌ను ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే అక్కడి ఉపయోగాన్ని బట్టి ఆ యూనిట్లు కేటాయించే అవకాశం ఉంటుంది. సామాజిక వర్గాల వారీగా కూడా ఒకే యూనిట్‌ను ఎక్కువ మంది నుంచి దరఖాస్తు చేసినా అందని ద్రాక్షే అవుతుందంటున్నారు.

ఇల్లెందు మున్సిపాలిటీలో...

మున్సిపాలిటీలో ఎస్టీ వర్గం 84 యూనిట్లు, ఎస్సీ 155, బీసీలకు 208, మైనార్టీ 89, క్రిష్టియన్లకు 13 యూనిట్లు ఎంపిక చేయాల్సి ఉంది. ఇల్లెందులో ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, గ్రామీణ వికాస్ బ్యాంకు, కోఆపరేటివ్ బ్యాంకులు ఉన్నాయి.

తుది నిర్ణయం బ్యాంకర్లదే..



మున్సిపాలిటీకి వచ్చిన అన్ని కేటగిరి దరఖాస్తులను పరిశీలించి జాబితాను బ్యాంకులకు పంపించాము. త్వరలో బ్యాంకులు జాబితా ఆధారంగా ఆయా కేటగిరీలకు రుణాలు అందజేసేందుకు జాబితా ఖరారు చేస్తారు. వారికి తెలంగాణ ఆవిర్భావం రోజున రుణం మంజూరు పత్రాలు అందజేస్తాము.

– సీహెచ్ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్